వరి సాగుకు వర్షం నీరే దిక్కు!

- ఆయిల్ ఇంజిన్ల సాయంతో పొలాలకు నీరు
- కాలువలకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి


పొలానికి ఆయిల్ ఇంజను సాయంతో నీటిని పెడుతున్న రైతు


పొలంలో వరి విత్తనాలను చల్లుతున్న రైతులు

పామర్రు: వరి సాగుకు నారుమళ్లు పోసే సమయం సమీపించడంతో కాలువల ద్వారా వస్తున్న అర కొరా నీరు చాలడం లేదు. దీంతో వర్షం నీటినే వరి సాగు పనులకు రైతులు వినియోగిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటబోదెల్లోకి చేరుకున్న వర్షపు నీటిని, కాలువల ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజిన్ల సాయంతో పొలాలకు నీరు పెడుతున్నారు. నారుమళ్లు పోసుకునే నేల మెత్త పడిన తర్వాత మడిలో చెత్తను తొలగించేందుకు మండలాగి, చదును చేసి దుక్కిదున్ని మడులను నాట్లుకు సిద్ధం చేస్తున్నారు. గ్రామంలో పలు చోట్ల సాగు భూమిలో దమ్ముమడి చేసి నారు మళ్లలో 1061, ఎర్ర బీపీటీ విత్తనాలను చల్లుతున్నారు.

సాగునీటిపై స్పష్టత ఏదీ?

నియోజకవర్గంలో ప్రతి ఏటా సుమారు 83 వేల ఎకరాల్లో వరి సాగుకు చేపడతారు. సాగుకు నీరు కాలువల ద్వారా అందకపోవడంతో కొందరు బోర్ల ద్వారా వచ్చే నీటితో నారుమళ్లు పోస్తున్నారు. మరి కొందరు పంటబోదెలలో ఉన్న వర్షపు నీటితోనే సాగు పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. అయితే సాగుకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో తెలపకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకుంటోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. జూన్‌లో రెండు వారాలు ఇప్పటికే పూర్తి అయిన తరుణంలో వరి సాగుకు నారు పోసుకోవాల్సి ఉంది. ఇంత వరకూ సాగుకు నీరు రాక పోవడం రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి సాగుకు నీరు అందించాలనే విషయాన్ని ప్రభుత్వం విస్మరించిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగుకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

వరి సాగుకు సంబంధించి నారుమళ్లు పోసుకునేందుకు కాలువలకు నీరు రాని నేపథ్యంలో బోర్ల ద్వారా అయినా నారు పోసుకునేందుకు 24 గంటల విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని రైతులు కోరుతున్నారు. కనీసం వారం రోజులపాటైనా 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పిస్తే బోర్ల ద్వారా వరినారు పోసుకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా బోరు నీటిని ఫాంపాంట్‌లలో కూడా నింపుకుని వ్యవసాయావసరాలకు వాడుకునే అవకాశం కూడా ఉంటుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగుకు నీరు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

నీటిని సకాలంలో విడుదల చేయాలి

వరి సాగు ప్రారంభానికి సన్నద్ధం అవుతున్న ఈ నేపథ్యంలో సాగుకు పూర్తి స్థాయిలో నీరులేక భగవంతుడిపై భారం మోపి కాలువల్లోని వర్షపు నీటినే నారుమళ్లకు వాడుకుంటున్నాం. ఈ నీరు అయిపోతే ఏమిటని ఆందోళనగా ఉన్నాం. ప్రభుత్వం స్పందించి సాగుకు నీటిని విడుదల చేయాలి.

-కేవీ రావు, రైతు, పామర్రు

నీరులేక పోతే నష్టపోతాం

ప్రస్తుతం సాగుకు నీరు అందించక పోతే రైతులు నష్ట పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి సాగుకు సత్వరమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- కె.వెంకటేశ్వరరావు, రాపర్ల

విత్తనాలు అందజేస్తాం

వరి సాగుకు అవసరమైన విత్తనాలు వచ్చాయి. ప్రస్తుతం వాటిని మొలక కట్టాం. త్వరలో వాటిని అందజేస్తాం. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలను సకాలంలో అందజేస్తున్నాం. సాగుకు నీరు సకాలంలో ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది.

- శివ నాగరాణి, ఏఓ, పామర్రు

క్లుప్తంగా

కొండలమ్మ సన్నిధిలో యోగా



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం నిర్వహించారు. గుడ్లవల్లేరుకు చెందిన యోగా టీచర్ జ్యోతి శిక్షణలో ఈ కార్యక్రమాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో చేపట్టారు. దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి అభిషేక పూజలు



రాపర్ల(పామర్రు): మండలంలోని రాపర్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష అభిషేక పూజలను చేశారు. తొలుత స్వామికి పంచామృతాభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి వడ మాలలతో పూజలను అర్చకులు ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తుంగల అంజయ్య తెలిపారు.

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: తారక రామా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుడు లంకా దినేష్ వితరణతో స్థానిక ఇండోర్ స్టేడియం సమీపంలోని చిన్నం గంగాధర్ ఇంటివద్ద ఈ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం. బ్రహ్మయ్య, దండమూడి సీతారామ స్వామి, పి. వేణుగోపాలరావు, కె. రాఘవయ్య, సురేంద్ర, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బాబా మందిర వార్షికోత్సవం



మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో 15వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మంగళవారం శ్రీలక్ష్మీగణపతి హోమం, శ్రీ రుద్రహోమం, శ్రీదత్తహోమం, శ్రీహర్షవర్ధిని హోమం, శ్రీనవగ్రహ హోమం, శ్రీసాయి గాయత్రి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. పండితులు చంగపల్లి రాజేష్ వర్మ ఆధ్వర్యంలో సాయిబాబాకు పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు కూరపాటికి ఘన నివాళి



వేములమడ(మొవ్వ): మొవ్వ మండల సీపీఎం నాయకుడు కూరపాటి కృష్ణమూర్తి అనారోగ్యంతో మంగళవారం వేములమడ గ్రామంలో మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న నిడుమోలు మాజీ ఎమ్మెల్యే శ్రీ పాటూరు రామయ్య, సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణ రావు, జిల్లా కమిటీ సభ్యులు యద్దనపూడి మధు, ఘంటసాల మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, మొవ్వ మండల కమిటీ సభ్యులు కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్‌రావు, ఉప్పలపు వెంకటాద్రి తదితరులు ఆయన భౌతిక కాయానికి సందర్శించి నివాళులర్పించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్న దాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షించారు.

‘వెన్నుపోటు’ బాబుకు అలవాటు


వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: నమ్ముకున్న ప్రజలను నట్టేట ముంచి వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబుకు అలవాటని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం, వెన్నుపోటు పుస్తకాన్ని మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో హామీలను ప్రజలకు ఇచ్చి అధికారం దక్కించుకున్న తరువాత వాటిని గాలికొదిలేసి ప్రజలను వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోయిన రామరాజు, ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, బేతపూడి వెంకటరమణ, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, కొల్లి శ్రీదర్, చిన్ని, జంపన కోటయ్య, దివి సతీష్, కొల్లి నాని, సాక్షి సాయిబాబు, గ్రంధి రామారావు, శీలం నరసింహ, వెనిగళ్ల ఫణి, భరత్, ఫణి, పాల్గొన్నారు.

పాఠశాల్లో ఆసక్తి కల్పించే వాతావరణం ఉండాలి


ప్రదర్శన తిలకిస్తున్న చిన్నారులు

గుడివాడ టౌన్: విద్యార్థులు పాఠశాలకు రావాలంటే ఆసక్తి కల్పించే వాతావరణం ఉండాలని సీడీపీఓ విజయా ఫ్లోరెన్స్ అన్నారు. మంగళవారం స్థానిక బేతవోలు ప్రైమరీ పాఠశాల్లో మోడల్ స్కూల్ ఫౌండేషన్‌లో భాగంగా మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పాఠశాలకు రావడంపై శ్రద్ధ పెరిగేలా ఇక్కడ ఏర్పాట్లు చేశామన్నారు. పిల్లల మానసిక స్థితి, శారీరక దృఢత్వం, గణిత పరిజ్ఞానం తదితర విషయాలపై అవగాహన కల్పించేందుకు ఇక్కడ ప్రత్యక్ష ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. అన్ని విషయాలు వివరించేలా పాఠశాల ఉపాధ్యాయులు చక్కని ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం సంధ్యారాణి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం జి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నీలం ప్రభాకరరావు, శ్రావణి, శ్రావణి దుర్గ, అనూష, అంగన్‌వాడీ ఎసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ జయంతి పాల్గొన్నారు.

మర్రివాడలో ‘పొలం పిలుస్తోంది’


పమిడిముక్కల మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం


కానుకొల్లులో మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాస్


అయ్యంకిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

పమిడిముక్కల: మండలంలోని మర్రివాడ, తాడంకి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ గణేష్‌రెడ్డి రైతులతో కలిసి నారుమడులను సందర్శించి సూచనలు, సలహాలు అందజేశారు. నారుమడిలో యాజమాన్య పద్ధతులను వివరించారు. కౌలు గుర్తింపు కార్డులు కావాల్సిన వారు గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు రాంనరేష్, వీపీఏలు రుక్మిణి, కావ్యరెడ్డి పాల్గొన్నారు.

కానుకొల్లులో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు సేద్యంలోని సమస్యల పరిష్కారానికి వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించొచ్చని సూచించారు. సర్పంచ్ నాగదాసి థామస్, సిబ్బంది సంధ్య, సబ్దార్ ఆలీ, ప్రకృతి వ్యవసాయ విజయ, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

అయ్యంకిలో..

అయ్యంకి(మొవ్వ): వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి పేర్కొన్నారు. మొవ్వ మండలం అయ్యంకిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు సమాయాత్తం కావాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులు సార్వా వరి సాగుకు సమాయాత్తం కావాలని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, ఏఓ బి.వేణుమాధవ్ కోరారు. మండలంలోని సింగరాయపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురుస్తున్నందున అదనులో విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిన విమలరామరాజు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన దంపతులపై కేసు

పెనమలూరు: సరిహద్దు వివాదంతో మహిళపై దాడి చేసిన దంపతులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామానికి చెందిన మేడసాని విజయ వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న తన స్థలంలో 2 సెంట్ల స్థలాన్ని సబ్బినేని చిన్నికృష్ణకు కొద్ది కాలం క్రితం విక్రయించింది. ఆమె పక్క స్థలంలో రేకుల షెడ్డులో ఉంటోంది. ఆమె తన హద్దులో మొక్కలు నాటగా చిన్నికృష్ణ, అతని భార్య వాణి గొడవ పడి కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన మేడసాని విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుడివాడ అభివృద్ధికి కలిసి పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణ అభివృద్ధికి అన్ని వర్గాలు కలిసి పని చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాల్లో ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి చెందిన 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకోవడం పి-4 యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ప్లాన్ అమలుకు అధికారులతో యాక్షన్ ప్లాన్‌పై విచారించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, తహసీల్దార్ లోకరాజు, కిరణ్, గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓలు విష్ణుప్రసాద్, సారధి, నాగమల్లేశ్వరి, మున్సిపల్ ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

వర్షం పడితే రోడ్డు చెరువే..


ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కొద్దిపాటి వర్షానికే నిలిచిన నీరు

మండవల్లి: కొద్దిపాటి వర్షానికే మండవల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు చెరువును తలపిస్తోందని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, ఎల్.ప్రసాద్, జి.నాగయ్య, వీరాంజనేయులు, నరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ జాతీయ రహదారి ఎత్తుగా అభివృద్ధి చేసి, అనుసంధానంగా ఉన్న మండవల్లి నుంచి మూడుతాళ్లపాడు, ఇంగిలిపాకలంక వంటి సుమారు 12 గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును ప్రారంభంలో మెరక చేయకపోవడంతో పల్లంగా ఉండి చిన్నపాటి వర్షానికే నీరు ఎటూ వెళ్లక నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఇదే మార్గంగుండా సుమారు 20 గ్రామాలకు చెందిన విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ప్రయాణించాల్సి ఉందన్నారు. ఇక్కడ మార్జిన్లు కూడా లేకపోవడంతో నీటిలో దిగి ప్రయాణించాల్సి వస్తోందన్నారు. అదే సమయంలో ఏదైనా వాహనం వస్తే బురద నీరు దుస్తులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును మెరక చేసి, డ్రెయినేజీలను ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండకుండా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అద్దె చెల్లించని షాపులను స్వాధీనం చేసుకున్న అధికారులు


షాపును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మొవ్వ: స్థానిక తృతీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలోని దుకాణాల్లో అద్దె చెల్లించని రెండు దుకాణాలను జిల్లా గ్రంథాలయ అధికారులు తహసీల్దార్ సమక్షంలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రంథాలయ ఆవరణలోని 3,4 నాలుగు షాపులను ఘంటసాల మండలం మల్లంపల్లికి చెందిన దొక్కు నాగజ్యోతికి మూడేళ్ల క్రితం గ్రంథాలయ పాలకురాలు తూములూరి కృష్ణకుమారి ఆధ్వర్యంలో అద్దెకు ఇచ్చారు. కొంతకాలం నుంచి దానిని తెరవకపోవడమే కాకుండా అద్దె కూడా చెల్లించకపోవడంతో జిల్లా గ్రంథాలయ సంస్థకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్న జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు స్థానిక గ్రంథాలయ పాలకురాలు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాలతో తహసీల్దార్ కే మస్తాన్ తాళాలు తెరచి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, డెప్యూటీ లైబ్రేరియన్ ఎంబీ డీటీ నగేష్, జూనియర్ అసిస్టెంట్ రామారావు, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


పెదపాలపర్రులో విద్యార్థి తల్లికి ప్రవేశపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ఇంటింటికీ తిరిగే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. బడి ఈడు గల పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న విద్యా బోధన గురించి వివరిస్తూ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

పాఠశాలల్లో యోగా కార్యక్రమాలు


పెయ్యేరు పాఠశాల్లో యోగా కార్యక్రమంలో భాగంగా ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు నిర్వహించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా యోగాసనాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు యోగాసనాలు వేయించారు. కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఉపాధ్యాయులు తెలిపారు.

నేడు పామర్రులో జాబ్ మేళా

పామర్రు: నిరుద్యోగ యువతీ యువకులకు బుధవారం తొమ్మిది గంటల నుంచి పామర్రు విజయవాడ రోడ్డులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, బజాజ్ ఫిన్సర్వ్ లిమిటెడ్, టాటా క్యాపిటల్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం తదితర ప్రముఖ కంపెనీల ప్రతినిధుల పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఫార్మసీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలవారు ముందుగా హెచ్‌టీటీపీఎస్//ఎన్ఏఐపీయుఎన్‌వైఏఎం.ఏపీ.జీవీవీఐఎన్/యూఎస్‌ఈఆర్-ఆర్‌ఈజీఐఎస్‌టీఆర్ఎల్‌టీఐఓఎన్ లింక్ నందు తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని పేర్కొన్నారు. జాబ్ మేళాకు రెజ్యూమ్ తోపాటు ఆధార్, పాన్ లింక్ అయిన ఫోన్‌ను తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 80743 70846, 63006 18985 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: ఏపీ ట్రాన్స్‌కో నున్న-గుడివాడ 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లైన్ల ఆధునికీకరణ, సాంకేతిక మరమ్మతుల కారణంగా ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనులు నిర్వహిస్తామని ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా గుడివాడ, పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని పేర్కొన్నారు. సాధారణ సరఫరాలో అంతరాయం ఏర్పడక పోయినా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ కోరారు. ముదినేపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో 1:30 నిష్పత్తి ప్రకారం అనగా 45 మంది విద్యార్థులు దాటిన తరువాత రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. తరువాత ప్రతి 40 మందికి మరో సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడం తగదన్నారు. స్టడీ లీవ్‌లో ఉన్నవారి స్థానాలను ఖాళీగా చూపడం ఉపాధ్యాయ సంఘాలకు ఏ మాత్రం అంగీకార యోగ్యం కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ప్రతిపాదిస్తున్న డిమాండ్లపై ప్రభుత్వం చర్చించేందుకు అంగీకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకం

మచిలీపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగ కమిటీలో వివిధ హోదాలలో నియమించారు. పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా యాకసిరి వెంకటేశ్వరరావు(మచిలీపట్నం), రాష్ట్ర కల్చరల్ విభాగం సంయుక్త కార్యదర్శిగా తుమ్మలపల్లి సుబ్రహ్మణ్యేశ్వర బాబు (గుడివాడ) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ సెక్రటరీగా గాలిబ్‌బాబు



కైకలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగా కైకలూరుకు చెందిన మహమ్మద్ గాలిబ్‌బాబు ఎంపికయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక పత్రం మంగళవారం విడుదలైంది. గాలిబ్‌బాబు కైకలూరు పంచాయతీ వార్డు సభ్యుడిగా, న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. పార్టీలో అనేక సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు కృతజ్ఞతలు తెలిపారు.